

# దోసెడు మల్లెలు

సి. యస్. రావు

మీనారాణి పాతికేళ్ళు నిండిన అందమైన అమ్మాయి. ఇంకా కుమారి మీనా రాణిగానే వుంది. రచయిత్రిగా ఆమె వయసు పది సంవత్సరాలు. మొదటి కథ తన పదిహేనవయేట రాసిందట. ఆమె కథలు అంటే పాఠకులు చెవి కోసుకుంటారు. మేధావులుకూడా మెచ్చు కుంటారు. చిన్న విషయాన్ని తీసుకొని ఎంతో తీయగా, అందంగా – మరచిపోలే కుండా కథను అల్లే నేర్పు ఆమె సొత్తు.

ఇంట్లో అమ్మా నాన్నా వున్నారు ఆమెకు. ఓ బావకూడా వున్నాడు. బావ అందగాడే. ఎప్పుడూ తెల్ల పైజామా, సిల్కు లాల్చీ వేసుకుంటాడు. ఉంగరాల గిరజాల జుట్టు. పచ్చని ఛాయ. రోమన్ వీరుని ముక్కులాంటి ముక్కు. ఎంతో ఆకర్షణగల మెరిసే కళ్ళు. రోజులో ఎక్కువసేపు యీజిల్‌ముందు నిలబడి ఏవేవో చిత్రాలు రాస్తుంటాడు. అతను అలా యీజిల్‌ముందు నిలబడినా, మీనా రాణీ వెంట కారులో బయటకు వెళ్ళినా చూసేవాళ్ళకి మళ్ళీ మళ్ళీ చూడా లనిపించే అందం అతనిది.

అంతటి అందగాడికీ దేవుడిచ్చిన శాపం మూగతనం. మాటలు వినబడ తాయి. మాటాడలేడు. అయినా అతని కళ్ళు ముఖకవళికలూ మాటలకందని భావాలను వ్యక్తంచేయగలవు.

మీనారాణి తను రాసిన మొట్టమొదటి కథ తన బావకు వినిపించింది చదివి. సైగలతోటే బాగుందన్నాడు. చూపుల తోటే అభినందిచాడు. అది అచ్చయింది ఓ పత్రికలలో. అప్పటినుంచీ ఏ కథ రాసినా, నవల రాసినా బావకు వినిపించ కుండా పంపించేది కాదు. అతను ఆమెకు సలహాదారుడు. తన రచనలకు ఖరీదు



కష్టే షరాబు– బావకు నచ్చితే అందరికీ నచ్చుతుందని ఆమె నమ్మకం. రాసేటప్పుడు బావకు నచ్చదేమోనని భయపడుతూనే రాస్తుంది. అతనికి నచ్చేలా రాయటమే ఆమె ధ్యేయం. అతని అభిరుచి మీద ఆమెకంత నమ్మకం. అంత తెలివైన బావకు మాటలు రావు. మాట్లాడుతున్నట్లు జీవకళఉట్టిపడేలా బొమ్మల్ని గీయగల బావ మాట్లాలేడు. అది ఆమె నిత్య ఆవేదన–

కాని బావ ఏనాడూ తనకు మాటలు రావని బాధపడలేదు. పడినా అతని చూపుల్లో వ్యక్తమయ్యేది కాదు ఆ బాధ. అతను గొప్ప ఆత్మవిశ్వాసంగల వ్యక్తి.

అటువంటి బావనే కథానాయకునిగా తీసుకొని కథరాసింది మీనారాణి. ఆ కథ రాసినప్పుడు బావ ఏదో అర్ట్ ఎగ్జిబిషన్ హడావిడిలో వూరుకెళ్ళాడు.

ఆ సమయంలో అతనికి చదివి వినిపించకుండానే ఆ కథను పోటీకి పంపించింది.

కథ బహుమతి గెలుచుకుంది.

నగరంలోని సాహిత్యాభిమానులు మీనారాణికి అభినందన సభ ఏర్పాటు చేశారు.

మీనారాణి వెంట ఆమె బావకూడా వెళ్ళాడు ఆ సభకు. నగరంలోని కొందరు రచయితలు, రచయిత్రులు, విమర్శకులూ, పెద్దలూ మీనారాణి రాసిన కథ గురించి ఎంతగానో పొగిడారు. కథను విశదంగా మళ్ళీ చెప్పి– ఆ కథ బహుమతి పొందడానికి గల కారణాలను వివరించారు విమర్శకులు.

మీనారాణి ఎంతో అనుభూతిని పొందింది. ఆ సభలోతన బావ ముఖంలోకి చూసింది. అతనిలో చలనంలేదు. ఆ కథ బాగుందని కానీ, బాగోలేదని కాని అతని ముఖ కవళికలు, చూపులూ వీసమంత కూడా వ్యక్తంచేయడం లేదు.

సభ ముగిసింది.

మీనారాణీ, ఆమె బావ యింటికి వచ్చేశారు. దార్లోకూడా బావ ఏమీ మాట్లాడకపోవడం మీనారాణికి బాధగానే వుంది. తను రాసిన ప్రతి కథా బావకు చదివి వినిపించి యీ ఒక్క కథే చదివి వినిపించలేదని కోపమేమో అనుకుంది.

వినిపించకపోవడానికి కారణం– మూగవాని గురించి రాసిన కథ కదా, బావ బాధపడతాడేమోననే గాని బావను లెక్కచేయకపోవడం కాదని తన మనసుకు తెలుసు. బావ ఆమాత్రం గ్రహించుకోలేడని తను అనుకోలేదు– అతని అవగాహన మీద, తెలివి మీద తనకానమ్మకం వుంది.

అయితే బావ ఎందుకు అంత నిర్లిప్తంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయకుండా వుండిపోయాడో తనకు అర్థం కావడంలేదు.

చివరకు తనకు చదివి వినిపించ కుండా పోటీకి కథ పంపించానని కోపమే వచ్చివుంటుందన్న నిర్ణయానికి వచ్చింది మీనారాణి.

ఆ రాత్రి మీనారాణి తన గదిలో కూర్చుని ఏదో రాయాలని తాపత్రయ పడుతోంది. మనసు ఎంతసేపూ బావ ప్రవర్తన గురించే ఆలోచిస్తోంది గాని రాయడానికి మొగ్గడంలేదు.

చివరకు 'బావ మనసు యింత సంకుచితమైనదా? అందరూ అంతగా మెచ్చుకొని, అంతగా నన్ను అభినందిస్తే ఒక్కసారి మాటవరసకు– కథ చాలా బాగుంది' అని చూపులతోటో సైగలతోటో అభినందిస్తే బావ సొమ్మేంపోతుంది? ఏంకొంపలు మునిగిపోతాయి.

'అందరిలాగా వుపన్యాసా లివ్వడానికి మూగవాడని నాకెలాగూ తెలుసు.' అనుకుంది మీనారాణి.

కలం కాగితం తీసుకుంది.

ఏదో ఆవేశంలో ఏదో రాయాలని మొదలుపెట్టింది. 'సముద్రపు లోతుల్ని కొలవవచ్చుగాని మనిషి మనసు లోతుల్ని కొలవడం మనిషికి సాధ్యంకాదు. నిన్నటివరకూ దేవుడిలా అగుపించిన మనిషే నేటి దెయ్యంగా మారిపోవచ్చు.




మనిషి మనసు చిత్రమైంది.–' అని రాసి ఒక్క క్షణం అలాగే పెన్ను పట్టుకొని రాయకుండా ఆగిపోయింది.

'బావను దెయ్యం' అని రాసినందుకు తన మనసు ఎందుకో నొచ్చుకుంది.–

ఇంతలో ఆమె కలంపట్టిన చేతిమీద మల్లెలవాన కురిసింది.

బావ దోసెడు మల్లెలు తెచ్చి ఆమె చేతిమీద కలంమీద పోసేడు. కాదు పూలతో పూజించాడు.

మీనారాణి వెనక్కి తిరిగి చూసింది.

వెనక బావ నవ్వుతూ నిలబడ్డాడు.

ఆ నవ్వులలో 'నీ కథ అంత బాగుంది' అన్న భావన స్పష్టమైంది.

బావ గురించి తను యింతవరకూ వూహించిన వూహలన్నీ తప్పని తెలియగానే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

కుర్చీలోంచి లేచి బావముందు దోషిలా నిలబడింది మీనారాణి– ఒక్క క్షణం నీళ్ళునిండిన కళ్ళతో బావ ముఖంలోకే చూస్తూ వుండిపోయింది. కన్నీటి తెర మాటునుంచి స్పష్టంగా కనిపించడంలేదు ఆమెకు. కళ్ళు తుడుచుకుంది.

బావ ఎంతో ఎత్తుగా అగుపించాడు ఆమెకు. 'మాటలు వచ్చినవారూ– మాటలు నేర్చినవారూ–ఎందరో నా కథను పొగిడారూ– నన్నభినంచారు. కాని బావ మాటలకందని మనసుభాషలలో నుంచి పొందిన యీ అభినందనకు సాటికావు అవన్నీ,' అంటూ అతని చేతులను తన చేతుల్లోకి తీసుకొని కళ్ళకు అద్దుకుంది.

